కష్టపడి విజయం సాధించాలి

గోలేటి టౌన్‌షిప్‌లోని గ్రంథాలయంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన, జనవరి 7: పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువతీయువకులు కష్టపడి చదివి విజయం సాధించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్ లో గల గ్రంథాలయాన్ని సందర్శించారు. పుస్తకాలు, వసతులను పరిశీలించి.. సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనీయర్ పీవో ప్రశాంత్ ఉన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి..

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సింగరేణి హైస్కూల్ విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్ లో గల సింగరేణి ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, మాట్లాడారు. స్కూల్ కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, సీనీయర్ పీవో ప్రశాంత్, హెచ్ఎం రవితేజ, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్లరెడ్డి ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏవో ప్రేమలత

కౌటాల, జనవరి 7: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల వ్యవసాయశాఖ అధికారి పెందం ప్రేమలత పేర్కొన్నారు. మంగళవారం విర్దండి పటేల్‌గూడ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల చదువు, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిరావహకులకు సూచించారు. ఆమె వెంట హెచ్ఎం రాములు, ఏఈవో అంజన్న, తదితరులు ఉన్నారు.

వంశీకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం క్రీడా సామగ్రి పంపిణీ

తాండూర్ : రేచినిలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న నాయకులు

తాండూర్, జనవరి 7 : బెల్లంపల్లికి చెందిన కీర్తి శేషులు తోడే వంశీకృష్ణా రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం రేచిని పంచాయతీ పరిధి క్రీడాకారులకు మంగళవారం నాయకులు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ముందుగా వంశీకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులర్పించారు. అతను చేసిన సేవలు, జ్ఞాపకాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ గౌడ్, వెంకాగౌడ్, శ్రీకాంత్, షేక్ హైమద్, రమేశ్, శ్రీనివాస్, కృష్ణ, లస్మక్క, మల్లక్క, శ్రావణ్, శివ, అశోక్, పర్వతాలు, సాయి, వినోద్, మనోజ్, గ్రామ యువత పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో వేటగాళ్లు

హాజీపూర్, జనవరి 7 : మండలంలోని టీకన్నపల్లె గ్రామ శివారులో వన్యప్రాణులను హతమార్చేందుకు ఏర్పాటు చేసిన 7 కిలోల బైండింగ్ వైరుతో పాటు, ఐదుగురు వేటగాళ్లను అదుపులోనికి తీసుకున్నట్లు లక్షెట్టిపేట రేంజ్ ఫారెస్టు ఇన్‌చార్జి అధికారి అత్తె సుభాష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. టీకన్నపల్లె గ్రామానికి చెందిన ఇర్రగడ్డ సాగర్, దుర్గం ప్రశాంత్ దొనబండలో బైండింగ్ వైరును కొనుగోలు చేశారు. 2వ తేదీన టీకన్నపల్లె గ్రామానికి తీసుకొని వచ్చారు. అదే గ్రామానికి చెందిన జాడి రాజలింగుకు చెందిన పత్తి చేను ఫారెస్టును ఆనుకొని ఉండటంతో విద్యుత్ స్తంభం నుంచి వన్య ప్రాణులను హతమార్చేందుకు దాదాపు రెండు కిలో మీటర్ల మేర బైండింగ్ ఏర్పాటు చేశారు. గస్తీ తిరుగుతున్న ఫారెస్టు అధికారులు 3వ తేదీన గమనించారు. మూడు రోజుల నుంచి గ్రామంలో విచారించిన ఫారెస్టు అధికారులు టీకన్నపల్లె గ్రామానికి చెందిన జాడి రాజలింగు, ఇర్రగడ్డ సాగర్, బుద్దిపల్లి గ్రామానికి చెందిన జాడి వినోద్, దుర్గం ప్రశాంత్, దర్గం రామును అదుపులోనికి తీసుకున్నారు. వారిని విచారించగా, నేరాన్ని అంగీకరించారు. వారిపై వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి, సెక్షన్ 35/3 ప్రకారం నోటీసులు అందజేశామని రేంజ్ ఇన్‌చార్జి అధికారి తెలిపారు. శుక్రవారం అర్రెస్టు చేసి, రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. హాజీపూర్ డిప్యూటీ రేంజ్ అధికారి సునీత, టీకన్నపల్లె బీట్ ఆఫీసర్ ఫరీదాబానును అభినందించారు.

పాఠశాలకు ఉత్తమ అవార్డులు

జన్నారం, జనవరి 7 : మండలంలోని కిష్టాపూర్ జడ్పీ సెకండరీ పాఠశాలకు జిల్లా ఉత్తమ పాఠశాల అవార్డు లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్ సీటీలో రాష్ట్ర ప్రభుత్వం, హెచ్‌వైబీఐజడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర పరిశోధనా సంస్థ డైరెక్టర్ రాధారెడ్డి, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ రాజగోపాల్, మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ ప్రీతిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాముక కమలాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి జడ్పీఎస్ఎస్కు..

వాంకిడి, జనవరి 7: మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల హైబీజ్ టీవీ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం-2024కి ఎంపికైనట్లు హెచ్ఎం నటరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్టీ జోన్-1లో జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా వాంకిడి జడ్పీఎస్ఎస్ పాఠశాల నిలువడంతో ఈ పురస్కారం లభించిందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో పురస్కారం అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.

జిల్లాలో బాక్సింగ్ క్రీడా అభివృద్ధికి కృషి

సీసీసీ నస్పూర్, జనవరి 7 : మంచిర్యాల జిల్లాలో బాక్సింగ్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాదం రవీందర్, కార్యదర్శి బోయిని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఉద్యోగం సాధించిన బాసాని ఆదర్శ్‌ను నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. కోచ్ జగత్‌సాయి శిక్షణలో బాసాని ఆదర్శ్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు జగత్‌సాయి, సందీప్, శ్రీకాంత్ యాదవ్, సీనియర్ క్రీడాకారులు గణేశ్, జశ్వంత్, ప్రశాంత్, అశోక్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ అభినందనీయం

రెబ్బెన, జనవరి 7: నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ఏఎస్సీ చిత్తరంజన్ పేర్కొన్నారు. రెబ్బెన పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోలాంగూడలో మంగళవారం రాత్రి పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మరుముల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇక్కడ రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, గ్రామ పెద్ద జంగుపటేల్, తదితరులు ఉన్నారు.

ఇండ్ల పంపిణీలో గందరగోళం

- అర్హుల జాబితాలో అవకతవకలు.. అయోమయంలో లబ్ధిదారులు
- అనర్హులను అర్హులుగా గుర్తించారంటున్న ప్రజలు
- పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- జాబితాను సవరించాలని సర్వత్రా డిమాండ్

మందమర్రిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు

మందమర్రి, జనవరి 7 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ ప్రస్తుతం గందరగోళంగా మారింది. ఇక్కడ 560 ఇండ్లు నిర్మించగా, సుమారు 2500 మంది దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, లబ్ధిదారులను ఎంపికచేశారు. క్షేత్రస్థాయిలో సర్వే అనంతరం 521 మందిని అర్హులుగా గుర్తించి, జాబితాను విడుదల చేశారు. అంతకుముందే డబుల్ బెడ్రూం ఇండ్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రారంభించారు. అప్పటి అధికారులు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయగా, ఎన్నికలు రావడంతో పంపిణీ నిలిచిపోయింది. అనంతరం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. నాటి అధికారులు రూపొందించిన జాబితాను పక్కన బెట్టి, మరో జాబితా తయారు చేసి మున్సిపల్ కార్యాలయంలో నోటీసు బోర్డుపై నాలుగు రోజుల క్రితం ప్రదర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, అధికారులు గుర్తించిన లబ్ధిదారుల పేర్లు లేకపోవడం, కొత్తవారి పేర్లు దర్శనమివ్వడంతో గత లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. దీంతో కొత్తగా ప్రకటించిన అర్హుల జాబితాపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది. జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, సొంతిల్లు ఉన్నవారినే ఎంపిక చేశారని, ఇప్పటికే పలు సంఘాల నాయకులు అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో అధికారులే పూర్తిస్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేయగా, ఇప్పుడు ఒకరిద్దరు కాంగ్రెస్ నాయకులు జాబితా తయారీలో ప్రధాన భూమిక పోషించారనే ఆరోపణలు సర్వత్రా వస్తున్నాయి. గతంలో 521 మందిని అర్హులుగా ప్రకటించగా, నేడు కేవలం 253 మందినే ప్రకటించడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

అర్హులు పేర్లను తొలగించారు..

డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయి. గతంలో క్షేత్రస్థాయిలో అధికారులు అన్ని రకాలుగా సర్వే చేసి, లబ్ధిదారులను ఎంపికచేశారు. ఆ జాబితాలో ఉన్న పేర్లు ఇప్పుడు ప్రకటించిన జాబితాలో లేవు. రాజకీయ జోక్యంతో అర్హులకు అన్యాయం జరుగుతున్నది. నిలువ నీడలేని నిరుపేదలకు గృహ వసతి కల్పించాలనే కేసీఆర్ ప్రభుత్వ ఆశయం నీరుగారుతున్నది. **-ఎండీ అబ్బాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మందమర్రి**

నిలువ నీడలేదు.. జాబితాలో పేరులేదు..

నా భర్త గతంలోనే చనిపోయిండు. ఉన్న ఒక్క కూతురికి పెండ్లి చేసి పంపిన. నాకు నిలువ నీడలేక బంధువుల సహకారంతో చిన్న షెడ్డు వేసుకొని బతుకుతున్న. ఇటీవల డబుల్ బెడ్రూం ఇంటి కోసం దరఖాస్తు చేసిన. నాకు ఇల్లు రాలేదు. అధికారులు ఇల్లు ఇస్తారని ఎంతో ఆశపడ్డ. కానీ, నా పేరు జాబితాలో లేదు. అధికారులు నా కష్టాన్ని గుర్తించి నాకు ఇల్లు కేటాయించాలి. **- రాజమ్మ, మందమర్రి**

సమయానికి రాని సిబ్బంది..

- ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిన ఎంపీడీవో కార్యాలయం

కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు

భీమారం, జనవరి 7 : భీమారం ఎంపీడీవో కార్యాలయం మంగళవారం ఉదయం 11 దాటినా ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. ఎంపీడీవో మధుసూదన్‌తో పాటు, ఎంపీవో కొత్తపల్లి సతీశ్‌రెడ్డి.. కొత్తపల్లి, మద్దికల్, ఎల్కేశ్వరంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఉండగా, సూపరింటెండెంట్ సంజీవ్, జూనియర్ అసిస్టెంట్లు పద్మ, రాజయ్య సమయానికి రాలేదు. అధికారులకు వేళకు రావడం లేదని కొంతకాలంగా ఫిర్యాదులు కూడా ఉన్నాయి. దీనిపై ఎంపీవో సతీశ్‌ను వివరణ కోరగా, ఎంపీడీవోతో పాటు, తాను సర్వేలో ఉన్నానని తెలిపారు. సిబ్బంది ఉదయం 10:30 వరకు కార్యాలయంలో ఉండాలని పేర్కొన్నారు.

9న వాహనాల వేలం

మంచిర్యాల అర్బన్, జనవరి 7 : ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు 9న ఉదయం 10 గంటలకు స్థానిక కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సీఐ గురువయ్య తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన

తాండూర్, జనవరి 7 : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏఎంవీఐలు ఖాసీం సాహెబ్, సూర్యతేజ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తాండూర్ ఐబీలో వాహనదారులు, ఆటో డ్రైవర్లకు రహదారి బద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని, రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పలు సూచనలు చేసి, వాహనాలకు స్టిక్కర్లను అంటించారు. హోమ్‌గార్డు రమేశ్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, జనవరి 7 : తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలో రెండు ప్రచార వాహనాలను రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి సంతోష్ ప్రారంభించారు. 31వ తేదీ వరకు కళా ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారులు, సంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

కౌటాల, జనవరి 7 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై ఆసిఫాబాద్ ఏ ఎంవీఐ విక్రం అవగాహన కల్పించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, పీసీ రవి, ఆర్ఏ టీఏ సిబ్బంది, కళాశాల సిబ్బంది ఉన్నారు.

దండేపల్లి (లక్షెట్టిపేట), జనవరి 7 : లక్షెట్టిపేట ట్రినిటీ పాఠశాలలో విద్యార్థులకు మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లు కిషోర్‌చంద్రరెడ్డి, ఖాసీం సాహెబ్, సూర్యతేజ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జోసెఫ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రి రూరల్, జనవరి 7 : మందమర్రి మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో 100సీట్లు, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సారా తస్నీం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ http:/telanganams.cgg. gov in/లో ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.120తో, ఓసీలు రూ.200 ఫీజు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు కాపీలనుమోడల్ స్కూల్‌లో అందించాలని సూచించారు. 6వ తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 13న ఉదయం, 7 నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఉపకార వేతనాల కోసం..

నస్పూర్, జనవరి 7 : తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలవుతున్న సంక్షేమ పథకాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, ధార్మిక, ఇతర ట్రస్టుల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు 2023-24 విద్యా సంవత్సరంలో ఉతీర్ణులైన వారి నుంచి ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సురేందర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ విద్యార్థులకు రూ. వెయ్యి, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.1500, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ, బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ , పీజీ విద్యార్థులకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తారని పేర్కొన్నారు. 15వ తేదీలోగా కార్మిక శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కాంప్లెక్స్ సమావేశానికి గైర్హాజరు

కెరమెరి, జనవరి 7: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సముదాయ సమావేశం (కాంప్లెక్స్ మీటింగ్)లో 50శాతం మంది ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారని కాంప్లెక్స్‌ల హెచ్ఎం ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, రికార్డులు, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ చక్కగా చేయాలని, విధులపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆర్వీలు నరేశ్, సురేశ్, వినీత్ ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై క్లుప్తంగా వివరించారు.

నామినేషన్ల స్వీకరణ

హాజీపూర్, జనవరి 7 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం ఎన్నికల కోసం మంగళవారం నామినేషన్లను స్వీకరించారు. జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన నామినేషన్ల స్వీకరణలో అధ్యక్షుడు గడియారం శ్రీహరి, హబీబ్ హుస్సేన్ ప్యానెల్‌లో 9 పోస్టులకు 12 మంది నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి శ్యామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించినట్లు చెప్పారు.

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

చెన్నూర్, జనవరి 7: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వివేక్ తెలిపారు. పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ప్రైమరీ హెల్త్ సెంటర్, అంబేద్కర్ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి మంగళవారం ఆయన శంఖుస్థాపన చేశారు. తహసీల్దార్ మల్లికార్జున్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లి, జనవరి 7 : కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై వంతెనను కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మండలంలో సీసీ రోడ్ల నిర్మాణ, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

పనులను త్వరగా పూర్తిచేయాలి

హాజీపూర్, జనవరి 7 : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల డీఆర్డీవో కిషన్ పేర్కొన్నారు. జిల్లాలోని ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లో చేపట్టిన వివిధ రకాల పనులను మంగళవారం ఎంపీవో ఉమర్ షరీఫ్, ఏపీవో మల్లయ్యతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ప్రతిభ, టీఏలు, ఏఫ్ఏలు ఉన్నారు.

ఆదివాసులకు ఇండ్లు ఇవ్వాలి

మందమర్రి రూరల్, జనవరి 7 : డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, ఏజెన్సీ చట్ట ప్రకారం గిరిజనులకు ఇవ్వాలని ఆదివాసీ నాయక్ పోడ్ సేవా సంఘం అధ్యక్షుడు పెద్ది భార్గవ్, లౌడం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు ముందుగా డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ సతీశ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మందమర్రిలోని ఊరు రామకృష్ణాపూర్, ఊరు మందమర్రి, నార్లపూర్‌లోని నిరుపేద గిరిజనులను గుర్తించి, ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధిని రాజేశ్, పల్లె పృథ్వీరాజ్, పాలమాకుల భీమ్ సేమ్, అరుణ్ కుమార్, రాయమల్లు, రమణ, ప్రణయ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అవార్డు గ్రహీతకు సన్మానం

మందమర్రి, జనవరి 7 : ఇటీవల బహుజన సాహిత్య అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్న మందమర్రి పట్టణానికి చెందిన దాసరి శ్రావణ్ కుమార్‌ను మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో ఆదిజాంబవ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణాధ్యక్షుడు కంబాల రాజనర్సు, నాయకులు బీదునూరి శంకర్, అవునూరి పోశం, రాసరి రాజనర్సు, ఇరుగురాల వెంకటి, గాలిపెల్లి తిరుపతి, ఏల్పుల వెంకటి, నరెడ్ల లక్ష్మణ్, సంగి రవి, రేగుంట రాజన్న, కల్వల సురేశ్, మధు, తోకల కుంబులు, బత్తుల శ్రీనివాస్, మంతెన భూమయ్య, జూపాక స్వామి, అరెంద కరుణాకర్, శ్యాం, బండ విజయ్ పాల్గొన్నారు.

వైకుంఠధామం పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్, జనవరి 7 : మంచిర్యాల గోదావరి తీరంలో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా పూర్తిచేయాలని, నాణ్యత పాటించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు, అధికారులున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

రెబ్బెన, జనవరి 7: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సతీశ్‌మాదిగ సమక్షంలో ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు జంగంపెల్లి రాజేశ్‌మాదిగ, దుర్గం రాకేశ్‌మాదిగ తెలిపారు. మండలాధ్యక్షుడిగా ఇప్ప నవీన్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దుర్గం అనిల్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దుర్గం రాజ్‌కుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా నక్క కిరణ్‌మాదిగ, గోలేటి కమిటీ గౌరవాధ్యక్షులుగా దుర్గం జనార్దన్ మాదిగ, ఇగురపు రాజశేఖర్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా నక్క ప్రభాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దూడల దశరథ్ మాదిగ, పొగుల నవీన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూర్ సమ్మయ్య మాదిగ, బెల్లంపల్లి మండలాధ్యక్షుడు మహేశ్ మాదిగ, నాయకులు ప్రభాకర్ మాదిగ, రాజేందర్ ఉన్నారు.

సీసీ కెమెరాలు కీలకం

మందమర్రి, జనవరి 7: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని అంగడిబజార్ ఏరియాలో మంగళవారం కమ్యూనిటీ కంటాక్ట్ నిర్వహించారు. కాలనీలో తనిఖీలు నిర్వహించి, సరైన పత్రాలు లేని 34 బైకులను సీజ్ చేశారు. మత్తు పదార్థాలకు సంబంధించి అనుమానిత ప్రదేశాల్లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేశారు. కాలనీలో ఏ సమస్యలున్నా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెస్సేజ్, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. అలాగే అంగడిబజార్‌కు చెందిన ఓ మహిళ తన ఇంట్లో నిల్వ ఉంచిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అలాగే గూడెంకు చెందిన ఓ వ్యక్తి కాలనీలో విక్రయించేందుకు తీసుకువచ్చిన ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

కౌటాల, జనవరి 7: మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయ రిజిస్టర్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన సేవ లందించాలని ఎంపీడీవో ప్రసాద్‌కు సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ తోటాజీ, ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏపీవో పూర్ణిమ, తదితరులు ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ

కౌటాల, జనవరి 7: సిర్పూర్(టి) అటవీ రేంజ్ పరిధిలోని పూసుగూడ, రావన్‌పల్లి, మేడిపల్లి గ్రామాల్లోని నిరుపేదలకు కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అడవులతోనే మానవులు మనుగడ ముడిపడి ఉందన్నారు. అడవుల నరికివేయడం, చెట్లకు నిప్పుపెట్టడం, వన్యప్రాణులను వేటాడం వంటివి చేయవద్దన్నారు. అడవుల రక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్, సెక్షన్ ఆఫీసర్లు వందన, తిరుపతి, మోహన్‌రావు, మోతిలాల్, సుబాస్‌గౌరి,